



# దొంగల మండపం

డా॥పేట శ్రీనివాసులురెడ్డి

**''ఆశకు లోబడకే మనసా!**
**పేరాశకు లోబడకే**
**ఆశకు లోబడితే నాశనమగుదువు మనసా''**

**-అంటూ దొంగల మండపంలో చీకటి పడ్డాక కాలక్షేపానికి తంబుర తీగ వాద్యాన్ని మీటుతూ తాత్త్విక గేయాలను పాడుతున్నాడు రామస్వామి. ముందు వెపు తప్ప, మూడువైపులా రాతి గోడలతో, శిల్ప శోభితమెన స్తంభాలతో ఎంతో కళాత్మకంగా, దేవుడు లేని గుడిలా ఉంటుంది దొంగల మండపం.**

రాతి గోడకు చెక్కిన గోవిందరాజస్వామి శిల్పం ముందు చిన్న దీపం... మండపంలో విస్తారంగా పరచుకొని ఉన్న చీకటిని జయించలేక చిన్నబోతోంది వెలుతురు. ఎక్కడెక్కడో భోజనాలను ముగించుకొని ఒక్కొక్కరుగా వచ్చి మండపంలో పది మంది దొంగలు గుంపుగా చేరారు.

''రేయ్! రామసామి కొంచేపు నీ సొద ఆపు. మేం మాట్లాడుకోవాల'' అని విసుక్కున్నాడు దొంగల నాయకుడు కర్రెబ్బ.

''సరే స్వామీ! మీరు మాట్లాడుకోండి'' అని పాడడం ఆపేశాడు రామస్వామి.

''గురూ! రేపు చిత్తానూరులో తిరప్తోళ్ళ పెళ్ళి. ఆరేడు బండ్లల్లో తెల్లారు జామున బయలుదేర్తారు. దోవలో దోచుకోవచ్చు.''

''సెబాష్ మంచి సమాచారం తెచ్చినావురా. బెదిరించి దోచుకోవాలి. తిరగబడినా సరే, ఎవర్నీ చంపొద్దు. శుభకార్యం కదా? అంత వరకు దారిలో కాపు క్కాసేదానికి ఇద్దరేసి వొంతులు వారీగా ఉండండి. బండ్లొస్తూనే ఈలెయ్యండి. అందరూ ముసురుకుంటాం'' అన్నాడు కర్రెబ్బ.

''గురూ! రాత్రి అలిపిరి కాడ దోచుకున్న సొమ్మును తెల్లారి బేరీధి బంగారంగిట్లో అమ్మబోతే... పోలీసోళ్ళు వెంటబడినారు. ఆ సొమ్ము తీసుకు పోయి ఒక చోట దాచి పెట్టి వచ్చినాము'' అని రామస్వామిని చూస్తూ నసిగాడు కొత్తగా దొంగల ముఠాలో చేరిన నాగులు.

''పర్వాలేదు చెప్పు. రామస్వామి చాలా మంచోడు. వీడు చిన్నప్పటి నుండి మన ముఠాకు తెలిసిన వాడే. వాళ్ళ అమ్మ నాయనలు తిరుపతి యాత్రకొచ్చినప్పుడు వీడు తప్పిపోయాడు. గుళ్ళు గోపురాల దగ్గర ప్రసాదాలు తిని, యాత్రికులిచ్చిన చిల్లర దుడ్డుతో బతికి బట్టగట్నాడు. అనాథ కాకుండా అందరివాడైనాడు. పదారేళ్ళ వయసొచ్చేసరికి పనీపాట చేసుకొని ఒకింటోడవుతాడనుకుంటే ఎవడో సన్నాసినాయాలొచ్చి ఈ దొంగల మండపంలో వీడికి ఏదో ఉపదేశం చేసి వీడ్ని సన్నాసిని చేసేసి పోయినాడు. అప్పట్నుంచి ఇదీ వరస. వీడు అన్నింటినీ వొదిలి పెట్టేసి తంబురాను మీటుకుంటూ, తత్త్వాలు పాడుకొంటూ, ఇల్లిల్లు తిరుగుతూ, నాలుగు గింజలు సంపాదించి ఇక్కడ్నే వండుకొని తిని, ఇక్కడ్నే పడుకొని, తెల్లారితే చిత్తానూరికో, తిరప్తికో పోతాడు. వాడు సచ్చినా మన విష

యాలు ఎవరికీ చెప్పడు. ఇంకొకరి విషయాలు మనకు చెప్పడు. వాడికిప్పుడు ఇరవై యేండ్లు వచ్చినా ఎలాంటి కోరికల్లేవంటే ఆశ్చర్యమేస్తుంది. దోచుకున్న సొమ్మును చుట్టుపక్కల పూడ్చి పెట్టినా వాడసలు పట్టించుకోడు. మనం దొంగలైనా వాడు మాత్రం దొంగస్వామి కాడు. ఇప్పుడు చెప్పు! ఎక్కడ దాచి పెట్టారో'' అన్నాడు కర్రెబ్బ.

"సింగాల గుంట కట్ట కింద''

"సరే! అక్కడేం భయం లేదు. సొమ్మెక్కడికీ పోదు'' అన్నాడు కర్రెబ్బ

***

తిరుపతికి నాలుగు కిలోమీటర్ల దూరంలో అలమేలు మంగాపురం ఉంది. దీనినే 'తిరుచానూరు' అని కూడా అంటారు. నోరు తిరగని స్థానికులు 'చిత్తానూరు' అంటారు. అలమేలు మంగాపురంలో శ్రీ వేంకటేశ్వరుని సతీమణి కొలువై, భక్త కోటిని కాపాడుతోందని వేరే చెప్పక్కర్లేదు. తిరుపతికి తిరుచానూరుకు సరిగ్గా మార్గ మధ్యంలో పడమర వైపున కాసింత దూరంలో దొంగల మండపం ఉంది. ఒకప్పుడు కాపు వీధి దాటుకుంటే తిరుచానూరు వరకు ఒక్క ఇల్లు కూడా ఉండేది కాదు. తిరుపతి-తిరుచానూరు మధ్య ప్రయాణం చేసే యాత్రికులు పగటి పూట విశ్రాంతి తీసుకోవడానికి దొంగల మండపం ఎంతో సౌకర్యంగా ఉండేది. అయినా ఎవరూ సాహసించి అక్కడికెళ్ళరు. ఉన్నట్టుండి వర్షం కురుస్తున్నప్పుడు, పిడుగులు పడుతున్నప్పుడు తప్పనిసరిగా యాత్రికులు దొంగల మండపంలో తలదాచుకొనేవారు. ఇక చీకటి పడిందో, ఒక పిట్ట ఉంటే ఒట్టు. తిరుపతి-తిరుచానూరు మధ్యలోని భూమి చౌడు నేల. ఈ కారణం వల్ల దొంగల మండపం దరిదాపుల్లో ఎక్కడా ఒక్క చెట్టు కూడా ఉండేది కాదు. ముళ్ళ కంపలు తప్ప. నడిచిపోతున్నా, వాహనాల్లో పోతున్నా దొంగల మండపం ఒక్కటే ఎడారిలో పెద్ద గుడారంలా కనిపించేది. ముప్ఫై ఐదేళ్ళకు ముందు కూడా ఇదే పరిస్థితి ఉండేది.

తిరుపతి రాను రానూ ఎవరూ ఊహించని విధంగా విస్తరించి పోయింది. తిరుపతి-తిరుచానూరులు కలిసి పోయాయి. పుట్టగొడుగుల్లా ఇళ్ళు లేచాయి. దొంగల మండపం భవంతుల మధ్య ఇరుక్కుపోయింది. పని గట్టుకొని తిరిగితే కాని కనిపించని స్థితికి చేరుకుంది. అయినా రామస్వామి నాటి నుండి నేటి వరకూ ఆ మండపాన్ని వదలలేదు. అక్కడే మకాం.


రామస్వామికి ఇప్పుడు అరవై ఏళ్ళు. తెల్లని పొడవాటి జుట్టు. పెద్ద గడ్డం. మధ్యలో సడలిపోయి, సాగిపోయిన కోల ముఖం. నిమ్మపండు లాంటి మేని ఛాయ. నుదురుపై పెద్ద నామం. మోకాళ్ళ వరకు కట్టుకొన్న ధోవతి. భుజం పై కండువా. చేతులకు, భుజాలకు నామాలు. మెళ్ళో రుద్రాక్షమాల. నిర్మలమైన చూపు. చేతిలో గుమ్మడికాయ బుర్రతో చేసిన తంబుర ఏకనాదం. ఆయనను చూస్తే ఎవరికైనా భక్తి భావం కలుగుతుంది. వేలు మీటుతూ, తత్త్వాలు పాడుతుంటే సాక్షాత్తు వేంకటేశ్వర స్వామి ఆ రూపంలో వచ్చి పాడుతున్నట్టుంటుంది. రామస్వామి తాతంటే చుట్టుపక్కల వారికి ఎంతో గౌరవం. అప్పుడప్పుడు తిరుపతికొచ్చే కొంత మంది బైరాగులు ఆయనను కలిసి వెళ్తుండేవారు. ఓ రోజు సాయంత్రం మండపంలో దీపం వెలిగించి, గోవిందరాజస్వామి శిల్పం ముందు పూలు పరచి, సాంబ్రాణి కడ్డీలు ముట్టించి దణ్ణం పెట్టుకొచ్చి తంబుర మీటుతూ-

"తోలుతిత్తి ఇది తూటులు తొమ్మిది
తుస్సుమనుట ఖాయం
ఓ జీవా! తెలుసుకో అపాయం...'' అంటూ పాడుతున్నాడు.

"రామస్వామి అంటే మీరేనా స్వామీ'' అంటూ ఒకతను పాటకు మధ్యలో అడ్డుతగిలాడు.

"అవును నేనే'' అంటూ తంబురను పక్కన పెడ్తూ బదులిచ్చాడు రామస్వామి.

"నాపేరు సుబ్బారెడ్డి. మాది కడపజిల్లా. నేను తిరుపతికి వచ్చి పదేళ్ళయింది. తిరుపతిలో క్లాస్ వన్ కాంట్రాక్టర్‌ను. బాగా సంపాదించాను. కోట్లు కూడే కొద్దీ మనశ్శాంతి కరువయ్యింది. ఏదో తెలియని వెలితి. ఓ రోజు ఉన్నట్టుండి భార్యా బిడ్డలకు ఆస్తిని వదిలి పెట్టేసి సన్యాసం పుచ్చుకొన్నాను. కపిల తీర్థం దగ్గర ఆశ్రమంలో తలదాచుకొంటూ, వచ్చే సాధువులతో ధ్యానంతో కాలక్షేపం చేస్తున్నాను''




"ఓ! మీరా రండి. మీ గురించి సాధువులు చెప్పగా విన్నాను. పొద్దు పోయాక వచ్చారేంటి?''

"అలమేలు మంగను దర్శనం చేసుకొని కాలినడకన వస్తూ మిమ్మల్ని చూసి పోదామని వచ్చాను''

"ఈ పూట మీరు నాకు దేవుడు పంపిన అతిథి''

మాటలు మొదలయ్యాయి. వాదాలు, తర్కాలు, తత్త్వ రహస్యాలను చర్చించారు. తిన్నగా మాటల్లో దొంగల మండపం ప్రస్తావనొచ్చింది.

"ఈ మండపంలో దొంగలుండేవారా స్వామీ?''

"అవును ఒకప్పుడు ఉండేవారు. తిరుపతి విస్తరించి, చుట్టుపక్కల ఇళ్ళొచ్చాక దొంగలు రావడం మానేశారు.''

"మీరు ఏభై ఏళ్ళుగా ఈ మండపంలో ఉంటున్నారు కదూ?''

"అవును...నాకు పదేళ్ళ వయసు నుండే ఇదే ఇల్లు, వాకిలి''

"దొంగలతో సహజీవనం చేశారు. వాళ్ళు మిమ్మల్నేమీ అనలేదా స్వామీ?''

"వాళ్ళ బతుకు వాళ్ళది. మన బతుకు మనది. నన్ను గౌరవంగానే చూసుకునేవాళ్ళు. నేనెప్పుడైనా అనారోగ్యంతో బాధ పడ్తుంటే కంటికి రెప్పలా కాపాడేవారు. వైద్యం చేయించేవారు. 'ఎవరు చేసిన ఖర్మ వారనుభవింపక ఎవరికైనను తప్పదన్నా' అనే తత్త్వాని దొంగలు అడిగి మరీ పాడించుకునే వాళ్ళు. ఎందుకయ్యా మీకీ పాట అంత ఇష్టం అని అడిగితే... మా ఖర్మ కొద్దే గదా సామి మేము దొంగలయింది. అనుభవింపక తప్పుతుందా సామీ అనే వాళ్ళు. నిజమే ఎవరి ఖర్మకు ఎవరు బాధ్యులు?'' అని చెప్పుకొచ్చాడు రామస్వామి.

"ఈ మండపాన్ని ఎవరు ఎప్పుడు కట్టించారు? గుడిలా రాతి గోడలకు ఎర్ర పట్టీలున్నాయి. రాతి స్తంభాలు, శిల్పాలు, రాతి తిన్నెలు అద్భుతంగా ఉన్నాయి. ఈ మండపాన్ని గురించి కొంచెం వివరంగా చెప్పండి స్వామీ!''

"తిరుపతి-తిరుచానూరు మధ్యలో స్వర్ణముఖీ నదీ తీరాన పొన్న కాలువ అనే ఊట కాలువ ఉంది. ఆ ప్రదేశం ఎంతో సుందరంగా పెద్ద పెద్ద పొన్న చెట్ల మధ్య ఆహ్లాదకరంగా ఉంటుంది. కాలువ పల్లంలో ఏటవాలు వెంబడి రెండంతస్తుల రాతి మండపం ఉంది... అక్కడ ప్రతి సంవత్సరం తిరుపతి గోవిందరాజస్వామికి 'పొన్న కాలువ ఉత్సవాన్ని' చేస్తారు. ఆ సమయంలో మార్గ మధ్యంలో ఉండే ఈ మండపంలో స్వామి వారికి నైవేద్యం సమర్పిస్తారు. అప్పుడు ఈ మండపం భక్తులతో కళ కళలాడిపోతుంది. దీనికి పద్మావతి పార్వేట మండపమని కూడా పేరుంది. పద్మావతీ దేవి శ్రీనివాస సమేతంగా ఇక్కడ వేంచేస్తారు. వేట కార్యక్రమం పూర్తయ్యాక, ఇక్కడే ప్రసాదాలు పంచేవారు. ఇప్పుడు పార్వేట తతంగాన్ని పద్మావతి అమ్మవారి గుడి పక్కనుండే ఉద్యానవనంలో నిర్వహిస్తున్నారు. దీనిని ఎవరు నిర్మించారో? ఎప్పుడు నిర్మించారో ఖచ్చితంగా చెప్పలేం. ఒకప్పుడు తిరుమలకెళ్ళే యాత్రికుల సౌకర్యార్థం ఇలాంటి మండపాలను ఆనాటి రాజులు నిర్మించేవారు. వీటినే 'దేశాంతరి మండపాల'ని కూడా అంటారు. తిరుమలకు నలువైపులా నుండి వచ్చే యాత్రికులకు

ఇలాంటి మండపాలు శ్రీవారి మెట్టుకెళ్ళే మార్గాల్లో, కరకంబాడి మార్గాల్లో ఉన్నాయి. అయితే ఈ మండపానికి, రేణిగుంట రోడ్డులోని మరో పార్వేట మండపానికి మాత్రమే ప్రాధాన్యముంది. ఇక్కడే దేవుళ్ళు ప్రతి ఏటా కొలువుదీరేది.'' అని తనకు తెలిసిన సంగతినంతా చెప్పాడు రామస్వామి.

''ఔను స్వామీ! ఈ మధ్య ఈ మండపాన్ని ఇనుప బీరువాలు చేసేవారు ఆక్రమించుకొని రేకులు తడ్తూ మండపాన్ని కొంత పాడు చేశారంట కదా?'' అని ప్రశ్నించాడు సుబ్బారెడ్డి.

''అబ్బో అదో పెద్ద కథ. ఆ పక్కనే ఉండే బీరువా ఫ్యాక్టరీ వాళ్ళ కళ్ళు ఈ మండపం పై పడ్డాయి. మండపాన్ని ఆక్రమించుకొన్నారు. ఇనుపరేకులు తటడం, వెల్డింగ్‌లు చేయడం, రంగులు పూయడం వంటి పనులు చేసేవారు. అదేమని అడిగితే దేవుడొచ్చేది సంవత్సరానికొక్కరోజే కదా! ఆ రోజు మండపాన్ని ఖాళీ చేసి ఉంచితే చాలు. అంటూ నన్ను గదమాయించారు. ఎక్కువ మాట్లాడితే నన్ను మెడబట్టి గెంటుతామన్నారు. ఆ శబ్దాలు ఇప్పటికీ నా చెవుల్లో గింగురుమంటున్నాయి'' అని చెప్పాడు రామస్వామి.

''మరి బీరువా వాళ్ళు ఇక్కడ్నుంచి ఎట్లా బయటకెళ్ళారు?''

''మండపాన్ని పాడు చేస్తుంటే చూడ్లేక చుట్టుపక్కల వాళ్ళతో కలిసి దేవస్థానం పై అధికారికి ఫిర్యాదు చేశాను. దేవస్థానం వాళ్ళొచ్చి మండపాన్ని ఖాళీ చేయించారు. అట్లా మండపం కొంత పాడైంది. అయినా దాన్నెవరూ ఇప్పటిదాకా పట్టించుకోలేదు. మండపంలో దొంగలున్నప్పుడే నయం. వాళ్ళు సంవత్సరానికొక్కసారి మండపానికి మరమ్మత్తులు చేసి, సున్నాలు పూయించి దేవుడి కార్యం కోసం శుభ్రంగా చేసి ఉంచేవాళ్ళు. వాళ్ళకు ఈ మండపం అంటే అంత ఇష్టం, గౌరవం. భోజనం వేళయింది. మీరు రాక ముందే అన్నం వండిపెట్టాను. తిని, ఈ రాత్రికి ఈ మండపంలోనే పడుకోండి. తెల్లారాక కపిల తీర్థం పోవచ్చు!'' అని చెప్పాడు రామస్వామి.

***




ఒకరోజు ఉదయం ఆరు గంటలకు ఆరేడుమంది దొంగల మండపం ముందు చేరి టేపు తీసుకొని కొలతలు వేస్తున్నారు.

''ఎవరు స్వామీ మీరు?'' అని అడిగాడు రామస్వామి.

''ఈ మండపాన్ని మా స్థలంలో కట్టారు'' అన్నాడొకడు.

''మీ స్థలంలోనా? ఇది వందలాది సంవత్సరాలకు ముందు నిర్మించింది కదా? మీదెట్లా అవుతుంది?''

''అదేమో మాకు తెలియదు. ఈ స్థలాన్ని మేం కొన్నాం. సర్వే నెంబర్లు, చెక్ బందీ అన్నీ కరెక్టుగానే ఉన్నాయి'' అన్నాడు మరొకడు.

ఇంతలో చుట్టు పక్కల వాళ్ళంతా గుంపు చేరారు. వాళ్ళకు ఏవేవో పత్రాలు చూపించారు.

''పత్రాలు ఈ మధ్యే కదా వచ్చాయి. ఇలాంటి కట్టడాల సమాచారం శాసనాల్లో ఉంటాయి'' అని ఎదురింటి పుల్లయ్య ప్రశ్నించాడు.

''అది ఏ శాసనంలో ఉందో చూపించు'' అన్నాడు మరో కబ్జాదారుడు.

''ఏటా గోవిందరాజ స్వామి పొన్నకాల్వ ఉత్సవం రోజు ఈ మండపంలోనే పూజలందుకుంటాడు. ఎంతో మంది భక్తులు ఇక్కడే దేవుణ్ణి కొలుస్తారు. అది చాలదా? మీది కాదు దేవుడిది అనేదానికి?'' అడిగాడు పక్కింటి మునికృష్ణ.

''అయితే దేవస్థానం ఆఫీసుకు పోయి కంప్లయింట్ చేసుకోండి. ఎక్కువ మాట్లాడితే మా స్థలంలోకి ప్రవేశించినందుకు మీ మీదనే పోలీసు కేసు పెడ్తాం. జాగ్రత్త. ఇక్కడ్నుంచి పొండి'' అన్నాడు కబ్జా నాయకుడు.

''మూడేళ్ళకు ముందు దేవస్థానం వాళ్ళే కదా పోలీసు బలగంతో బీరువాలు తయారే చేసే వాళ్ళను ఖాళీ చేయించింది? '' అని ప్రశ్నించాడు రామస్వామి.

''ఈ రోజుల్లో నిముషాల్లోనే ఎన్నో జరిగి పోతుంటాయి. మూడేళ్ళకు ముందు కథ చెప్తావా?'' ఒక కబ్జాదారుడు కోపంగా అన్నాడు.

''ఇవన్నీ దొంగ పత్రాలు. మేం నమ్మం''

''అవును దొంగ పత్రాలే. ఏం చేసుకుంటారో చేసుకోపొండి. ఈ మండపాన్ని ఇప్పుడే స్వాధీనం చేసుకుంటున్నాం.''

రామస్వామి చుట్టుపక్కల వారిని కూడేసుకొని దేవస్థానం ఆఫీసుకెళ్ళాడు. సంబంధిత అధికారులు తాపీగా ఆ స్థలం మా దేవస్థానానికి చెందినట్లు రికార్డుల్లో కనిపించడం లేదన్నారు. అందరూ అవాక్కైపోయారు. ఆఫీసు నుంచి బయటకొచ్చి ఏం చేయాలో తోచక తలలు పట్టుకొన్నారు. ఇంతలో ఒకాయన వాళ్ళను సమీపించి...

''ఆఫీసులో మీరు చెప్పిందంతా పక్కనే ఉండి విన్నాను. నా పేరు శివనాగయ్య. నేను తిరుమల వెయ్యి గాళ్ళ మండపం పరిశోధన పని మీద ఈ ఆఫీసుకొచ్చాను. దేవస్థానం కాదన్నంత మాత్రాన మీరు అధైర్యపడాల్సిన పని లేదు. ఒకవేళ 'దొంగల మండపం' లాంటి చారిత్రాత్మక, పురాతన కట్టడాలు సొంత పట్టా స్థలంలో ఉన్నా వాటిని స్వాధీన పరుచుకునే హక్కు, తొలగించే హక్కు ఎవరికీ లేదు. కబ్జాదారులు తప్పనిసరిగా రెవెన్యూ అధికారుల అనుమతి తీసుకోవాలి. దీనికి భిన్నంగా ప్రవర్తిస్తే చట్టరీత్యా నేరం. మీరు ముందు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయండి. తర్వాత ఈ మండపం ఆ దేవదేవునిదేనని శాసనాలు చూసి నిర్ధారిస్తా. రేపు వచ్చి మండపాన్ని పరిశీలిస్తా!'' అంటూ శివనాగయ్య మిత్రులతో కలిసి వెళ్ళిపోయాడు.

శివనాగయ్య చెప్పినట్లే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు దొంగల మండపం కాలనీ వాళ్ళు.

''వాళ్ళను తరిమేస్తాం. ఒక వేళ అది సొంత పట్టా అయినా మా రెవెన్యూ భూముల్లో రెండింతల స్థలం ఇచ్చి సెటిల్ చేస్తాం. మీరు నిశ్చింతగా వెళ్ళండి. రేపటి నుంచి పోలీసులను కాపలా పెడ్తాం'' అంటూ రెవెన్యూ అధికారులు కాలనీ వాసులకు భరోసా ఇచ్చారు.

అర్ధరాత్రి దాటింది. పిడుగులు పడ్తున్నట్లు, భూమి కంపిస్తున్నట్లు శబ్దాలు. ప్రొక్లెయినర్లతో కబ్జాదారులు, కిరాయి గుండాలు వీర విహారం చేశారు. దొంగల మండపం నేల మట్టమైపోయింది. ఎదురు తిరిగిన కాలనీ వాళ్ళను చితగ్గొట్టారు. పోలీసులు మంత్రి కార్యక్రమానికి బందోబస్తుకెళ్ళారు. స్టేషన్‌లో సెంట్రీల తప్ప ఎవరూ లేరని సమాధానం. తెల్లవారింది. జనమంతా మండపం చుట్టూ పోగయ్యారు.

''రామస్వామి ఏమైనాడు?'' ఎవరో ప్రశ్నించారు.

''.....''

''అదిగో ఆ రాతి స్తంభాల కింద రక్తం.''

''అవును. స్తంభాల కింద మనిషి నలిగిపోయుండాడు.''

''ఇంకెవరు... రామస్వామే''

''తంబురకు తీగ తెగిపోయింది. తునా తునకలైపోయింది.''

ఆర్కియాలజిస్టు శివనాగయ్యకు ఈ విషయం తెలిసి హుటాహుటిన చూడ్డానికొచ్చాడు.

''ఎంత ఘోరం? ఇదే విదేశాల్లోనైతే ప్రాచీన కట్టడాలకు చెడు చేస్తే యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తారు. పాత రాయినైనా సరే ప్రాణం కన్నా మిన్నగా చూసుకుంటారు. ఇంత పెద్ద చారిత్రక మండపాన్ని కూల్చి ఎంత దర్జాగా వెళ్ళిపోయారు? వాళ్ళు ఎవరినైనా, ఎంతమందినైనా డబ్బుతో కొనేయగలమనుకుంటున్నారు. పాప పుణ్యాలు విచారించే దేవుణ్ణి కొనలేరుగా?'' అంటూ నిట్టూర్చాడు శివనాగయ్య.

కూలిపోయిన రాతి గోడ మీద రామస్వామి బొగ్గుతో రాసిన తత్త్వం లోని రెండు వాక్యాలను చూశాడు శివనాగయ్య.

''గూటిలో చిలకేదిరా! చిన్నన్నా
గూడు చినబోయెరా...''

నిజమే. ఈ మండపంలో దేవుడు అనే చిలక ఏడాదికొక రోజే ఉంటుంది. రోజూ ఉండే రామస్వామి అనే చిలక పైకెగిరిపోయింది. గూడులాంటి మండపం చినబోయింది. శివనాగయ్య హృదయం ద్రవించి కళ్ళల్లో పెల్లుబికింది.

*(దొంగల మండపం వాస్తవం - కబ్జాదారులు మండపాన్ని కూల్చేయడం వాస్తవం - పాత్రలు కల్పితం)*

★

రచయిత సెల్: 98493 07333